సాక్షి
జనగామ

మంగళవారం | 30 | ఏప్రిల్ | 2024



బీజేపీ గెలిస్తే మరింత అభివృద్ధి

మహబూబాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్‌ను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామని పార్టీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా అన్నారు. - 8లో▸



దేశాన్ని కాపాడేందుకే మద్దతు

దేశాన్ని కాపాడుకునేందుకే కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలుకుతున్నట్లు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
43^0 /29^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వడగాలులు వీస్తాయి. రాత్రి సమయంలో ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

హామీల అమలుకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది



పాలకుర్తి టౌన్: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీ రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీ భారత ప్రధాని కాబోతున్నారని, తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీ రుణాన్ని తీర్చుకోవాలంటే పార్టీ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, నాయకులు అనుముల మల్లారెడ్డి, గంగు కృష్ణమూర్తి, చిలువేరు కృష్ణమూర్తి, ఎర్రబెల్లి రాఘవరావు, పులి గణేష్, జలగం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధిగా లక్ష్మారెడ్డి



చిల్పూరు: మల్కాపూర్ గ్రామానికి చెందిన కేశిరెడ్డి లక్ష్మారెడ్డిని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి కత్తి వెంకటస్వామి, జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సోమవారం ప్రకటించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి సింగపురం ఇందిర ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శిరీష్‌రెడ్డి, నష్కల్ ఎంపీటీసీ పాశం శిరీషసురేష్, పార్టీ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేష్, ఎడవెల్లి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎండిన 'ప్రకృతి' మొక్కలు



జనగామ : ఓ వైపు ఎండలు దంచికొడుతున్నాయి.. మరో వైపు జిల్లా కేంద్రంలోని ఇండస్ట్రియల్ ఏరియా పట్టణ ప్రకృతి వనంలో మొక్కలను పట్టించుకునే వారు లేకపోవడంతో అవి మాడిపోతున్నాయి. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించి నాటిన మొక్కలు నామరూపాల్లేకుండా పోతున్నాయి.

'ఓపెన్' పరీక్షల్లో ఒకరి డీబార్

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం సమగ్ర శిక్ష రాష్ట్ర జాయింట్ డైరెక్టర్, ఓపెన్ స్కూల్ పరీక్షల హనుమకొండ జిల్లా అబ్జర్వర్ పి.రాజీవ్ వివిధ కేంద్రాలను సందర్శించారు. పరకాల టీఎస్‌డబ్ల్యూ ఆర్ఎస్ గర్ల్స్ కేంద్రంలోని ఏ సెంటర్‌లో ఇంటర్ విద్యార్థి ఒకరిని డీబార్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ ఒక ఇన్విజిలేటర్‌ను రిలీవ్ చేశారు. అనంతరం ములుగు జిల్లాలోని ప్రభుత్వ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రాలను సందర్శించారు. ప్రభుత్వ హైస్కూల్‌లో విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ ఒక ఇన్విజిలేటర్‌ను విధులనుంచి రిలీవ్ చేశారు. వరంగల్ నగరంలోని మట్టెవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు ఉన్నారు.

'సదస్సుపై మతోన్మాద ఫాసిస్టు దాడులు'

విద్యారణ్యపురి: కాకతీయ యూనివర్సిటీలో ఆదివారం సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన సదస్సులోకి ఏబీవీపీ ఇతర సంఘ్ పరివార్ శక్తులు చొరబడి కవులు, రచయితలపై దాడి చేయడాన్ని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.శ్రీనివాస్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కె.భారతి సోమవా రం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఇది మనువాద బావజాలంతో కూడిన మతోన్మాద ఫాసిస్టు దాడులుగానే డీటీఎఫ్ భావిస్తున్నదని పేర్కొన్నారు. సదస్సును అడ్డుకొని దాడి చేయడాన్ని ఏఐవైఎఫ్‌రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వలీఉల్లాఖాద్రి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. బాధ్యులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రచారణమే!



తేలిన అభ్యర్థుల లెక్క

- వరంగల్‌నుంచి 42మంది, మానుకోటలో 23మంది ఫైనల్
- చివరిరోజు ఎనిమిది మంది నామినేషన్ల ఉపసంహరణ
- ఇప్పటికే ముఖ్యమంత్రి, మాజీ సీఎం రాకతో ఓరుగల్లులో రాజకీయ వేడి
- చోటామోటా నేతలతో ఓటర్లను తమవైపునకు తిప్పుకునేలా ప్రణాళికలు
- సోషల్ మీడియా వేదికగా ప్రచారం ముమ్మరం

హీటెక్కుతున్న సోషల్ మీడియా ప్రచారం..

కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు సోషల్ మీడియా ద్వారా ప్రచారాన్ని మరింత వేగిరం చేశారు. సెకన్ల వ్యవధిలో లక్షలాది మందికి చేరే అవకాశం ఉండటంతో ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసుకొని ఓటర్లకు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు. రోజువారీ తమ కార్యక్రమాల వివరాలతోపాటు గెలిపిస్తే ఏం చేస్తామో వివరిస్తున్నారు. అదేసమయంలో తమపై ప్రత్యర్థులు చేసే ఆరోపణలకు కూడా కౌంటర్ ఇచ్చేలా వీడియోలు రూపొందించి జనాల్లోకి వదులుతున్నారు. కొందరు ప్రత్యర్థి పార్టీలు, అభ్యర్థులపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో మీమ్స్ రూపొందించి వ్యంగ్యాస్త్రాలను వదులుతున్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

సాక్షి, వరంగల్: వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలనుంచి బరిలో ఉన్న అభ్యర్థుల సంఖ్య తేలింది. వరంగల్‌లో ఎన్నికల అధికారుల స్క్రూటినిలో 48 మంది దరఖాస్తులు ఆమోదమైతే.. సోమవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ ఉపసంహరించుకున్నారు. దీంతో బరిలో ఉన్న అభ్యర్థుల సంఖ్య 42గా ఖరారైంది. ప్రధాన పార్టీల అభ్యర్థుల ముఖ్య అనుచరులు స్వతంత్రులను చాలామందిని తప్పించే ప్రయత్నం చేసినా పెద్దగా ప్రభావం చూపలేదని తెలుస్తోంది. 32 మందికి మించి అభ్యర్థులుంటే ఒక్కో పోలింగ్ బూత్‌లో మూడు ఈవీఎంలు ఉండనుండడంతో తమపై ఎంతో కొంత ప్రభావం చూపొచ్చని భావిస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని మరింత వేడెక్కించారు. ఇక నామినేషన్ల ఘట్టం ముగియడంతో ఇటు పార్టీ కార్యకర్తల సమావేశాలు, బూత్ స్థాయి మీటింగ్‌లు, ఇంకోవైపు కుల సంఘాలతో భేటీ కార్యక్రమాలు వేగిరం చేశారు. మే 13న ఎన్నిక ఉండడం, ప్రచారానికి 11వ తేదీ వరకే గడువు ఉండడంతో అతి తక్కువ సమయంలోనే ఎక్కువ మంది ఓటర్లను ప్రసన్నం చేసుకునేలా ప్రణాళికలు రచించుకొని ముందుకెళ్తున్నారు. ఎంపీ అభ్యర్థి అందరి దగ్గరికి వెళ్లే అవకాశం, తగిన సమయం లేకపోవడంతో ఆయా నియోజకవర్గాలు, మండలాల్లోని ముఖ్య నేతలే అభ్యర్థులుగా ప్రచారం చేసి పార్టీని విజయపథంలో తీసుకెళ్లేలా కృషి చేయాలని అధిష్టానాల నుంచి ఆదేశాలు రావడంతో రంగంలోకి దిగారు. ఇప్పటికే ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ వరంగల్‌లో పర్యటించిన నేపథ్యంలో రాజకీయ వాతావరణం బాగా హీటెక్కింది. వారిద్దరూ తమ మాటల తూటాలతో పార్టీ కార్యకర్తలను ఉత్తేజపరుస్తూనే, జనాలకు అర్థమయ్యే రీతిలో ప్రసంగాలు చేశారు. మే తొలివారంలో జరిగే బీజేపీ సభకు ప్రధాని మోదీ రానుండడంతో ఇంకా పీక్ స్థాయికి చేరనుంది.

చోటామోటా నాయకులే అన్నీ తామై..

ఎన్నికల వేళ చోటామోటా నాయకులే అభ్యర్థులకు అండదండగా ఉంటున్నారు. బూత్ స్థాయిలో ఎవరు ఎవరికీ ఓటేయగలరో చెప్పే వీళ్లు ఓటరు జాబితా పట్టుకొని టిక్కులు పెడుతున్నారు. అలా టిక్కులు పెట్టి వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటుచేస్తున్నారు. ఆత్మీయ, బస్తీ, కాలనీ సమావేశాలు ఏర్పాటుచేసి మద్దతు కూడగడుతున్నారు. పుట్టిన రోజులను కూడా వదలడం లేదు. ఎక్కడా వివాహాలు ఉన్నాకూడా అభ్యర్థులకు సమాచారం ఇచ్చి ఆ కార్యక్రమానికి హాజరు కావడం ద్వారా వందలాది మంది ఓటర్లకు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు. ఎంపీ అభ్యర్థులు కూడా వీరికే ప్రాధాన్యత ఇస్తూ తమ ఓటు షేర్‌ను మరింత పెంచుకునే పనిలో నిమగ్నమయ్యారు. అదేవిధంగా మతపెద్దలు, సామాజిక వర్గాలు, గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీ సంఘాలు, కార్మిక, ఉద్యోగ సంఘాలతో అభ్యర్థుల తరఫున ముఖ్యనేతలు, కుటుంబ సభ్యులు సమావేశమై ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

ఎవరెవరు తప్పుకున్నారంటే..

వరంగల్ స్థానంనుంచి చివరి రోజు సోమవారం ఆరుగురు అభ్యర్థులు తప్పుకున్నారు. వారిలో స్వతంత్ర అభ్యర్థులు ఇల్లందుల శోభన్ బాబు, కుమ్మరి కన్నయ్య, బాబు బర్ల, మార్త రాజభద్రయ్య, డాక్టర్ విజయ్ కుమార్, వేణు ఇసంపెల్లిలు ఉన్నారు. వీరు తమ నామినేషన్లను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్యను కలిసి ఉపసంహరించుకున్నారు.

ఇద్దరు మాత్రమే ఉపసంహరణ

మహబూబాబాద్: మానుకోట పార్లమెంట్ స్థానంలో 30 మంది అభ్యర్థులు నామినేషన్ వేయగా ఐదుగురు అభ్యర్థులవి తిరస్కరణకు గురయ్యాయి. 25 మందితో జాబితా సిద్ధం చేయగా, ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు పోరిక సామ్యుల్, పోరిక అశోక్ తమ నామినేషన్లను విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో బరిలో నిలిచే సంఖ్య 23గా ఖరారు అయ్యింది.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- జనరల్ అబ్జర్వర్ రాబర్ట్ సింగ్



ఎన్నికల ఏర్పాట్లపై అబ్జర్వర్‌కు వివరిస్తున్న కలెక్టర్

జనగామ రూరల్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రాబర్ట్ సింగ్ అన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధి జనగామ సెగ్మెంట్‌లో ఎన్నికల ప్రక్రియను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లపై వివరించారు. అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ పాల్గొన్నారు.

పాలకుర్తిలో రణ్వీర్ చంద్ పరిశీలన

పాలకుర్తి: నియోజకవర్గానికి సంబంధించి ఓటింగ్ కోసం పాలకుర్తిలో చేపట్టిన ఏర్పాట్లను అబ్జర్వర్ బండారి స్వాగత్ రణ్వీర్ చంద్ సోమవారం పరిశీలించారు. స్థానిక సాంఘిక సంక్షేమ విద్యాలయంలోని స్ట్రాంగ్ రూం, క్రిటికల్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం పాలకుర్తి హైస్కూల్‌తో పాటు పలు పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, తహసీల్దార్ వెంకటేశం, పాలకుర్తి సీఐ మహేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

భువనగిరి బరిలో 39 మంది

సాక్షి, యాదాద్రి : లోక్‌సభ ఎన్నికల్లో ఉపసంహరణ ఘట్టం సోమవారం ముగిసింది. భువనగిరి లోక్‌సభ స్థానంలో 12 మంది అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. 39 మంది రంగంలో మిగిలారు. ఈసారి ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 61 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. శనివారం నామినేషన్ల పరిశీలనలో 10 మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 15 మంది అభ్యర్థులకు మించితే రెండో బ్యాలెట్ యూనిట్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. 30 మంది అభ్యర్థులు, ఒక నోటా బటన్ ఉండడంతో మూడు బ్యాలెట్ యూనిట్‌లతో ఎన్నికలు నిర్వహించనున్నారు.

3 నుంచి పోస్టల్ బ్యాలెట్ పత్రాల స్వీకరణ

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: పోస్టల్ బ్యాలెట్ పత్రాలను మే 3వ తేదీ నుంచి స్వీకరించనున్నాం.. ఈ ప్రక్రియపై అధికారులు అవగాహన పెంచుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నియోజకవర్గాల వారీగా స్వీకరించనున్న పోస్టల్ బ్యాలెట్ పత్రాలపై మాస్టర్ ట్రెయినర్లతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తహసీల్దార్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గం పరిధి ఆర్వో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ పత్రాల స్వీకరణకు ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేషన్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై వివిధ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లాలో గ్రాడ్యుయేట్ ఓటర్లు 23,320 మంది ఉండగా.. అందులో పురుషులు 14,862, మహిళలు 8,457, ఇతరులు ఒకరు ఉన్నట్లు పేర్కొన్నారు. మే 2 నుంచి 9 వరకు నామినేషన్ల స్వీకరణ, 10న పరిశీలన, 13న నామినేషన్ల విత్ డ్రా ఉంటుందని చెప్పారు. అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, కలెక్టరేట్ ఏఓ రవీందర్, పర్యవేక్షకులు శ్రీనివాస్‌రావు, పార్టీల ప్రతినిధులు కమలాకర్, శ్రీధర్, వెంకటమల్లయ్య, విజయభాస్కర్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకే గుర్తుల కేటాయింపు

- కలెక్టర్ పి.ప్రావీణ్య



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి ప్రావీణ్య

కాశీబుగ్గ/కాజీపేట సెంటర్: ఎన్నికల సంఘం నిబంధనల మేరకే గుర్తులు కేటాయించినట్లు వరంగల్(ఎస్సీ) -15 పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన అనంతరం కలెక్టరేట్‌లో కేంద్ర సాధారణ ఎన్నికల పరిశీలకులు బండారి స్వాగత్ రణ్వీర్ చంద్ సమక్షంలో బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీలకు ప్రత్యేకంగా ఎన్నికల సంఘం గుర్తులు కేటాయించిందని, ఎన్నికల సంఘంచే గుర్తింపు పొందని, రిజిస్టర్ అవ్వని, ఇండిపెండెంట్ అభ్యర్థులకు ఎన్నికల సంఘం సూచించిన నిబంధనల మేరకు తెలుగు అక్షర మాల ప్రామాణికంగా గుర్తులు కేటాయించినట్లు తెలిపారు. ఒకే గుర్తును ప్రతిపాదించిన ఇద్దరు అభ్యర్థులకు డ్రా పద్ధతిలో సింబల్ కేటాయించామని తెలిపారు. అడిషనల్ ఆర్‌ఓ సంధ్యారాణి, సహాయ ఆర్‌ఓ కె.శ్రీనివాస్, ఏఆర్‌ఓలు అశ్విని తానాజీ వాకడే, రాధికాగుప్తా, పీయూశ్ కుమార్, డీఎస్ వెంకన్న, రోహిత్ సింగ్, నారాయణ, వెంకటయ్య, మంగీలాల్, సీదం దత్తు, కె.వెంకటేశ్వర్లు, జిల్లా ఎన్నికల పోలీస్ నోడల్ అధికారులు, అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

అవకాశమిస్తే ఆదర్శంగా నిలుపుతా..

- బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రమేష్

కొడకండ్ల/దేవరుప్పుల : గడిచిన పదేళ్లలో ప్రధాని మోదీ పాలనలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది.. తనను ఆదరించి అవకాశం కల్పిస్తే వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలుపుతానని బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం కొడకండ్ల, దేవరుప్పుల మండల కేంద్రాలతోపాటు సీతారాంపురం, పెద్దమడూరు, నీర్మాల గ్రామాల్లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లలో ఆయన మాట్లాడారు. కుంభకోణాల కాంగ్రెస్‌ను నమ్మితే భవిష్యత్ అధోగతేనని, మోసపూరిత హామీలను నమ్మొద్దని పిలుపునిచ్చారు. కడియం శ్రీహరిది నమ్మించి మోసం చేసే వ్యక్తిత్వమని, ఆయన ఎక్కడ కాలు పెడితే అక్కడ కష్టాలు తప్పవన్నారు. విముక్తి పోరులో కీలక పాత్ర పోషించిన పాలకుర్తి యువత రాజకీయాల్లో నూతన ఒరవడిని చాటాలని అన్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన వారు బీజేపీలో చేరారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ లేగ రాంమోహన్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ శ్రీమాన్, జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ రాజశేఖర్, బీజేపీ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కాసాని సత్తయ్య, పడమటింటి నర్సింహ, రాష్ట్ర నాయకులు దామోదర్‌రెడ్డి, మహేందర్, కోటేశ్వర్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. దేవరుప్పుల మండలం నీర్మాల ఎంపీటీసీ మేడ కళ్యాణి భర్త వెంకటేష్ రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందగా.. విషయం తెలుసుకున్న అరూరి రమేష్ వారి ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సుర్రుమంటున్న సూరీడు

- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- 10 మండలాల్లో ఆరెంజ్ అలర్ట్
- మండుటెండల్లో రైతులు, కూలీల కష్టాలు



ఎండలోనే ధాన్యం కాంటా వేస్తున్న కార్మికులు

జనగామ: జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. 45 డిగ్రీల సెల్సియస్‌కు చేరువ కావడంతో ఎండలు మండిపోతున్నాయి. ఇళ్లలో ఉండే ప్రజలు అధిక వేడికి తట్టుకోలేక తల్లడిల్లిపోతుంటే.. ఇక ఆరుబయట పనులు చేసే రైతులు, కార్మికుల పరిస్థితి చెప్పనలవిగా ఉంది. సోమవారం జిల్లాలో అత్యధికంగా పాలకుర్తిలో 43.4, అత్యల్పంగా నర్మెటలో 39.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు పెరగడం, వడగాల్పులు, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరో రెండు రోజులు వడగాల్పులు పెరిగే అవకాశం ఉందని హెచ్చరించిన వాతావరణ శాఖ.. జిల్లాలోని పది మండలాలకు ఆరెంజ్ అలర్ట్, తరిగొప్పుల, నర్మెట మండలాలు ఎల్లో జోన్‌లో ఉన్నట్లు ప్రకటించింది. ఎండాకాలం ప్రారంభమైన నాటి నుంచి ఈ రెండు మండలాల్లో మిగతా ప్రాంతాలతో పోల్చితే 4 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్నాయి.

అన్నదాతలకు 'అగ్ని' పరీక్ష

యాసంగి సీజన్‌లో ధాన్యం అమ్ముకునేందుకు రైతులు.. పొట్టకూటి కోసం హమాలీలు సుర్రు మంటున్న సూర్యుడితో పోటీ పడుతూ పనులు చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తేమ 17 శాతానికి మించకుండా, తాలు లేని నాణ్యమైన ధాన్యానికి మద్దతు ధర చెల్లిస్తున్నారు. ధాన్యంలోని తేమను తగ్గించడానికి రైతులు నడి ఎండలో వడ్లు ఆరబోసి పడరాని పాట్లు పడుతుంటే.. కొనుగోలు చేసిన సరుకును ఎగుమతి చేసేందుకు హమాలీ కార్మికులు చమటలు కక్కుతూ కష్ట పడుతున్నారు. ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాల వద్ద డీ హైడ్రేషన్‌కు గురైన సమయంలో అందించేందుకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు.


అంగన్‌వాడీలకు సెలవులు ప్రకటించాలి: అదనపు కలెక్టర్‌కు పౌరుడి విజ్ఞప్తి

రఘునాథపల్లి: ఎండల తీవ్రత భారీగా పెరగడంతో పలు జిల్లాల్లో వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం బయటకు రావొద్దని హెచ్చరించింది. అన్ని పాఠశాలలకు వేసవి సెలవులు ఇచ్చారు. అయితే.. అంగన్‌వాడీలకు సెలవులు ప్రకటించక పోవడంతో ఇంత టి విపత్కర పరిస్థితుల్లో ఐదేళ్ల లోపు చిన్నారులు రోడ్ల మీదకు రావాల్సిన దుస్థితి నెలకొంది. పిల్లలకు వడ దెబ్బ తగిలే ప్రమాదం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకొని అంగన్‌వాడీ సెంటర్లకు సెలవులు ప్రకటించాలని మండల కేంద్రానికి చెందిన ఠాకూర్ గణేష్‌సింగ్ సోమవారం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అయితే.. ఆ నిర్ణయం తమ పరిధిలో లేదని.. అయినా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అదనపు కలెక్టర్ చెప్పినట్లు ఠాకూర్ గణేష్‌సింగ్ తెలిపారు.

సోమవారం నమోదైన ఉష్ణోగ్రతలు		
మండలం	కనిష్టం	గరిష్టం
పాలకుర్తి	35.4	43.4
జఫర్‌గఢ్	35.2	43.2
కొడకండ్ల	34.9	42.8
జనగామ	35.0	42.5
చిల్పూరు	35.7	42.3
దేవరుప్పుల	33.5	42.0
లింగాలఘణపురం	33.0	41.6
స్టేషన్‌ఘన్‌పూర్	33.4	41.4
బచ్చన్నపేట	32.3	40.7
రఘునాథపల్లి	32.6	40.6
తరిగొప్పుల	31.5	39.9
నర్మెట	30.9	39.3

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా వైద్యాధికారి హరీష్




పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

రఘునాథపల్లి: ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వైద్య సేవలు అదించడంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి హరీష్ అన్నారు. మండల పరిధి కోమల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించి, వైద్యులు, సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. సమయ పాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రికి సంబంధించిన శిథిల గదులను తొలగించాలని చెప్పిన ఆయన.. ఇటీవల చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించారు. డాక్టర్ మధుకర్, సీహెచ్‌ఓ సీనారాణి, ప్రమీల, ఉదయ్‌కుమార్ ఉన్నారు.

కొలువుల 'భరతుడు'

- ఒక ఉద్యోగం ఉండగానే.. మరో నాలుగు..
- ఉన్నత విద్యకు తల్లిదండ్రుల తోడ్పాటు



కుటుంబ సభ్యులతో భాషిపాక భరత్

దేవరుప్పుల : కృషి, పట్టుదల ఉంటే ఎదైనా సాధించవచ్చని నిరూపించాడు కడవెండికి చెందిన భాషిపాక భరత్. ప్రభుత్వ కొలువు రావడమే గగనమైన ఈ రోజుల్లో ఏకంగా ఐదు ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నాడు. వివరాలిలా ఉన్నాయి.. కడవెండికి చెందిన వ్యవసాయ కూలీలు భాషిపాక సుజాత, రవి దంపతుల కొడుకు భరత్ స్వగ్రామంలో పదో తరగతి చదివాడు. వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ డిప్లొమా, ఉస్మానియా వర్సిటీలో బీటెక్, కేయూలో ఎంటెక్(స్ట్రక్చరల్ అండ్ కన్‌స్ట్రక్షన్) చేశారు. ఆ తర్వాత ఉద్యోగ నియామకాలు లేకున్నా నిరాశ పడకుండా అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీలో బ్యాచలర్ ఇన్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ కోర్సు పూర్తి చేశాడు. ఇలా ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఉన్నత చదువులు కొనసాగించిన క్రమంలో.. తల్లిదండ్రులు కూలీ పనులు చేస్తూ కొడుక్కి ఏ లోటూ రాకుండా చూసుకున్నారు. ఏడేళ్ల నిరీక్షణ తర్వాత గత ఏడాది కేంద్ర ప్రభుత్వ హోమ్ మంత్రిత్వ శాఖలో ఉద్యోగం వచ్చింది. ఆ కొలువు చేస్తూనే.. ఉన్నత అవకాశాల కోసం మరో నాలుగు పోటీ పరీక్షలు రాసి ప్రతిభ కనబర్చాడు. దీంతో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, టౌన్ ప్లానింగ్, బిల్డింగ్ ఓవర్‌సీర్, గ్రూప్–4, అసిస్టెంట్ ఇంజనీర్ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. తల్లిదండ్రులకు చేరువగా ఉండాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వ పరిధి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉద్యోగంలో చేరడానికి నిర్ణయించుకున్నాడు. ఇదిలా ఉండగా.. భరత్ చెల్లెలు అమ్ములు ఎంఎస్సీ ఆర్గానిక్ విభాగం చదివి ఓ ప్రైవేట్ ఉద్యోగం సాధించింది.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..

నా తల్లిదండ్రుల ప్రోత్సహంతోనే ప్రభుత్వ ఉద్యోగం సాధించాను. హైదరాబాద్ వెళ్లి క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొన్నాను. కొన్ని పోటీ పరీక్షల్లో ఒకటి, రెండు మార్కుల తేడాతో ఉద్యోగం రాలేదు. ఓపిక తెచ్చుకుని చదివా. ఆత్మవిమర్శ చేసుకుంటూ.. లోపాల్ని సరిదిద్దుకుని స్మార్ట్ వర్క్ చేస్తే విజయం వరిస్తుంది.

- భాషిపాక భరత్, కడవెండి

కావ్యకు ఎంపీగా పోటీ చేసే అర్హత లేదు

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ


మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

నయీంనగర్: కడియం కావ్యకు వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసే అర్హత లేదని, ఆమె ఎస్సీ ఎలా అయిందో న్యాయపోరాటం చేస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడియం కావ్యను గెలిపిస్తే రద్దు అయి మళ్లీ ఉప ఎన్నిక వస్తుందన్నారు. రాజ్యాంగంలో హిందూ దళితులకు (ఎస్సీ) మాత్రమే రిజర్వేషన్ ఉందని, దళితులు బౌద్ధమతం, సిక్కులైనా రిజర్వేషన్ అమలు కాదన్నారు. కాంగ్రెస్ తీసుకొచ్చిన చట్టం ప్రకారం ఇతర మతాలకు చెందిన వారు ఎస్సీలు కాదని, దళితులు మతం మార్చుకుంటే కులం కూడా మారినట్లే అన్నారు. కడియం కావ్య మతాంతర వివాహం ఏ పద్ధతి ప్రకారం జరిగిందో కడియం శ్రీహరి వెల్లడించాల్సిన అవసరం ఉందన్నారు. కడియం శ్రీహరి ఎస్సీనే కాదని గతంలో రేవంత్‌రెడ్డి అన్నారని, అలాంటప్పుడు కడియం కావ్య ఎలా ఎస్సీ అవుతుందన్నారు. కడియం కావ్య ముస్లిం ఆచారం ప్రకారం వివాహం చేసుకుంటే ఆమె జనరల్‌కు వెళ్తుందని, ఇది తాను చెప్పడం లేదని రాజ్యాంగం చెబుతోందన్నారు. దళిత అవకాశాలను దోచుకున్న ద్రోహి కడియం శ్రీహరి అన్నారు. ఇవన్నీ నిరూపించి కడియం ముక్కు అంబేడ్కర్ విగ్రహం వద్ద నేలకు రాయిస్తానన్నారు. సమావేశంలో ఎంఎస్పీ జాతీయ నాయకులు మంద కుమార్ మాదిగ, వేల్పుల సూరన్న కాపు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, రాష్ట్ర నాయకులు జన్ను దినేష్ మాదిగ, మంద రాజు మాదిగ, కట్ల రాజశేఖర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

బీజేపీ గెలిస్తే మరింత అభివృద్ధి

పార్టీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా


మాట్లాడుతున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

మహబూబాబాద్ అర్బన్: మహబూబాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్‌ను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామని పార్టీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో 'మానుకోట జనసభ' నిర్వహించారు. ఈ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సమ్మక్క, సారలమ్మకు, రామప్ప శివుడు, గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్‌కు నమస్కరిస్తున్నామన్నారు. దేశ అభివృద్ధికి పాటుపడే ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. మోదీ నేతృత్వంలో కేంద్రంలో ముచ్చటగా మూడో సారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం చేసి వందల ఏళ్ల కలను సాకారం చేసిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. బీజేపీ ప్రభుత్వం 370 ఆర్టికల్‌ను రద్దు చేసిందని, కాంగ్రెస్ పార్టీలా ఓటు బ్యాంకు రాజకీయం చేయడం లేదన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే బీజేపీ ప్రధాన ఎజెండా అని, పీఎం ఆవాస్ యోజనలో భాగంగా ఇప్పటి వరకు నాలుగు కోట్ల గృహాలు నిర్మించి పేదలకు ఇచ్చామని, రాబోయే రోజుల్లో 3 కోట్ల గృహాలు నిర్మిస్తామన్నారు. నిరుపేదలకు ఉజ్వల యోజన పథకం కింద 10 కోట్ల కుటుంబాలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశామని, ఆయుష్మాన్ భారత్ పథకంలో నిరుపేదలకు రూ. 5లక్షల వరకు ఉచిత వైద్యం అందజేస్తున్నామన్నారు. తెలంగాణలో ఎకనామికల్ కారిడార్లను నెలకొల్పి అభివృద్ధి చేస్తామని, అమృత్‌భారత్‌లో భాగంగా మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌ను ఆధునీకరిస్తున్నామన్నారు. హైదరాబాద్ నుంచి భద్రాచలం వరకు జాతీయ రహదారి నిర్మాణానికి కృషి చేస్తామని, కేంద్రీయ విద్యాలయాలు నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. బీజేపీ ప్రధాని అభ్యర్థి నరేంద్రమోదీ అని, ఇండియా కూటమిలో ప్రధాని అభ్యర్థి ఎవరని ప్రశ్నించారు. ఇండియా కూటమి ఆయా వారసుల కోసమే ఏర్పాటు చేశారన్నారు. బీఆర్ఎస్ హయాంలో అన్ని రంగల్లో అవినీతి రాజ్యామేలిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. కూటమి నేతలందరూ కుంభకోణాలకు పాల్పడ్డారని, మాజీ సీఎం కేసీఆర్ కూతురు కవిత మద్యం కేసు కుంభకోణంలో జైలులో ఉన్నారన్నారు. గతంలో సీతారాంనాయక్ గిరిజన గురుకులాలు, ఏకలవ్య గురుకుల పాఠశాలలు, డిగ్రీ గురుకులాలు తీసుకువచ్చారన్నారు. అందుకే ఆయనను గెలిపించాలన్నారు. ఎంపీ అభ్యర్థి సీతారాం నాయక్ మాట్లాడుతూ గతంలో చేసిన అభివృద్ధే తనను గెలిపిస్తుందన్నారు. మానుకోటలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం మంజూరు చేయించానని, కాజీపేటకు మంజూరైన పీరియాడికల్ ఓవర్ హాలింగ్‌ను ప్రధానమంత్రి వ్యాగన్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ ఫ్యాక్టరీగా మార్చారన్నారు. కొల్లాపూర్ నుంచి మణుగూరుకు ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్‌కు కృషి చేశానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, ఓబీసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్, రాజ్యసభ్య మాజీ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, పార్లమెంట్ ఇన్‌చార్జ్ మార్తినేని ధర్మారావు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పార్లమెంట్ ప్రభారి వెంకటనారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మోసంగి మురళి, సీనియర్ నాయకులు శ్యామ్‌సుందర్‌శర్మ, ఎడ్ల అశోక్ రెడ్డి, వద్దిరాజు రామచందర్ రావు, యాప సీతయ్య, మదన్‌లాల్, సింగారపు సతీశ్, భూక్యా సంగీత, ఇందుభారతి, రాధాపటేల్, పద్మా, రేష్మా, సిరికొండ సంపత్, బోయినపల్లి లక్ష్మణ్‌రావు, వెంకటేశ్వర్లు, శశివర్ధన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వీరప్ప, శ్రీనివాస్‌రెడ్డి, పైండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి సీతారాం నాయక్


సభకు హాజరైన జనం

రూ.1.38 లక్షల నగదు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ ఇన్‌చార్జ్‌కు అప్పగిస్తున్న సీఐ

ఖిలా వరంగల్ : వరంగల్ అండర్ బ్రిడ్జి శివనగర్ బస్టాప్ వద్ద మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య ఆధ్వర్యంలో సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఇందులో శివనగర్‌కు చెందిన కొక్కు తిరుమలరావు వద్ద ఎలాంటి ఆధారం లేని రూ.1,38,500 నగదు లభించడంతో స్వాధీనం చేసుకున్నారు. తదిపరి చర్యల నిమిత్తం పట్టుబడిన నగదును ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ ఇన్‌చార్జ్‌కు అప్పగించినట్లు సీఐ మల్లయ్య తెలిపారు. ఎస్సైలు గోవర్ధన్, మహిమూద్, మున్నీరుల్లా పాల్గొన్నారు.

డీసీ తండా పరిధిలో రూ.లక్ష..

వర్ధన్నపేట: మండలంలోని డీసీ తండా పరిధిలో ఆదివారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ఓ కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. లక్ష నగదు లభ్యంకాగా స్వాధీనం చేసుకున్నామని వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ సోమవారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా చౌలతండా తానమచర్ల గ్రామానికి చెందిన తేజావత్ మురళి సూర్యాపేట నుంచి హనుమకొండకు కారులో వెళ్తుండగా డీసీ తండా చెక్ పోస్టు వద్ద తనిఖీ చేయగా ఎలాంటి ఆధారం లేని రూ. లక్ష నగదు లభించడంతో స్వాధీనం చేసుకున్నామన్నారు.

దేశాన్ని కాపాడేందుకే కాంగ్రెస్‌కు మద్దతు


సభలో అభివాదం చేస్తున్న నారాయణ, ఎమ్మెల్యేలు కడియం, కూనంనేని, ఎంపీ అభ్యర్థి కావ్య తదితరులు

● రాజ్యాంగానికి అత్యంత ప్రమాదకారి మోదీ
● సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ

న్యూశాయంపేట: రాజ్యాంగానికి ప్రధాని మోదీ అత్యంత ప్రమాదకారి అని, దేశాన్ని కాపాడుకునేందుకే కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలుకుతున్నట్లు సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ అన్నారు. సోమవారం హనుమకొండ హంటర్‌రోడ్డులోని ఓ కన్వెన్షన్ హాల్‌లో సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన పార్టీ బలపరిచిన వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోసం జరిగిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దర్యాప్తు సంస్థలను తన గుప్పిట్లో పెట్టుకుని తన మాటవినని ఇతర పార్టీల నాయకులను మోదీ జైలుకు పంపిస్తున్నాడని ఆరోపించారు. పదేళ్ల కాలంలో 29 మంది ఆర్థిక నేరగాళ్లు బ్యాంకులకు రూ. పదిలక్షల కోట్లు ఎగ్గొట్టారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మంగళసూత్రాలు మిగలవని మాట్లాడే హక్కు మోదీకి లేదన్నారు. తన భార్య మంగళ సూత్రాన్ని గౌరవించని మోదీకి ఇతరుల గురించి ఎందుకని ప్రశ్నించారు. మోదీతో చీకటి దోస్తానాతో కేసీఆర్ ప్రజలకు దూరమయ్యాడన్నారు. కేసీఆర్ నయవంచకుడని, ప్రజలను మోసం చేశాడని ఆరోపించారు. వరంగల్ మేధావులు, వామపక్షవాదుల కేంద్రమని, నిన్న కాకతీయ యూనివర్సిటీలో రచయితలు, మేధావులు నిర్వహిస్తున్న సదస్సుపై ఏబీవీపీ విద్యార్థుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో మోదీకి ఓటు వేస్తే ఆత్మహత్య సదృశ్యమే అవుతుందన్నారు. మోదీకి కుర్చీలేక పోతే పిచ్చి పట్టి తిరుగుతాడన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే ప్రజాసామ్యం పదిలంగా ఉంటుందన్నారు. వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కావ్య మాట్లాడుతూ రాజ్యాంగం వల్లే తాను పోటీచేస్తున్నానన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు టి.శ్రీనివాస్‌రావు నేదునూరి జ్యోతి, విజయసారథి, రాజారెడ్డి, వెంకట్రాములు, విశ్వేశ్వర్‌రావు, రాజ్‌కుమార్, స్టాలిన్, కరుణాకర్, బాషుమియా, అక్బర్, సాదాలక్ష్మి, లెనిన్, ప్రసాద్, బద్రి, రవీందర్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి' మాక్ టెస్ట్‌కు స్పందన


తాళ్ల పద్మావతి కళాశాలలో 'సాక్షి' మాక్ ఎంసెట్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

● 750 మందికి పైగా విద్యార్థుల హాజరు

కాజీపేట: 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో సోమవారం కాజీపేట మండలం సోమిడి శివారులోని తాళ్లపద్మావతి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన 'సాక్షి' మాక్ టెస్ట్‌కు స్పందన లభించింది. నగరంలోని వివిధ జూనియర్ కళాశాలల విద్యార్థులు 750 మందికి పైగా హాజరై తమ ప్రతిభను పరీక్షించుకున్నారు. ఈ మాక్ టెస్ట్ వల్ల త్వరలో ప్రభుత్వ ఆధ్వర్యంలో జరగబోయే ఎంసెట్ పరీక్షపై పూర్తి అవగాహన ఏర్పడిందని పలువురు విద్యార్థులు పే ర్కొన్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' బ్రాంచ్ మేనేజర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో అతర్లీనంగా దాగి ఉన్న శక్తులను వెలికి తీయడంతో పా టు పరీక్షలపై చక్కటి అవగాహన కల్పించడం కోసమే 'సాక్షి' మాక్ టెస్ట్ నిర్వహించినట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టర్లు తాళ్ల వంశీ, చైతన్య, 'సాక్షి' వరంగల్ బ్యూరో ఇన్‌చార్జ్ గడ్డం రాజిరెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జ్ వి.లింగయ్య, ఈవెంట్స్ మేనేజర్ ఎస్.సుమన్‌తోపాటు తాళ్ల పద్మావతి కళాశాల, 'సాక్షి' సిబ్బంది పాల్గొన్నారు. 'సాక్షి' మాక్ టెస్ట్‌పై పలువురు విద్యార్థులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

ఆత్మ స్థైర్యాన్ని ఇచ్చింది



మాక్ టెస్ట్‌కు కళాశాలలో అధ్యాపకులు శిక్షణ ఇచ్చారు. దీనికి తోడు 'సాక్షి' నిర్వహించిన మాక్‌టెస్ట్ నాలో ఆత్మ స్థైర్యాన్ని నింపింది. పరీక్షలో ఎలాంటి ప్రశ్నలు వచ్చినా రాయగలననే ధైర్యం వచ్చింది. ఇలాంటి మాక్ టెస్ట్‌లు రాయడం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుంది.

- టి . భానుప్రియ, ఆర్‌డీ జూనియర్ కళాశాల

సమయపాలనపై అవగాహన



ఎంసెట్ పరీక్ష రాసేటప్పుడు సమయం ఎలా ఉపయోగించుకోవాలో తెలిసింది. 'సాక్షి' ఆధ్వర్యంలో నిజమైన పరీక్ష మాదిరిగానే మాక్‌టెస్ట్ నిర్వహించారు. ప్రశ్నపత్రంలో కొన్ని ప్రశ్నలు సులువుగా, మరికొన్ని కఠినంగా ఉన్నాయి. దీని వల్ల నేను ఏ స్థాయిలో పరీక్షలకు సిద్ధమయ్యాననే విషయం బోధపడింది.

- పి.వర్షిత, ధ్రువ జూనియర్ కళాశాల

భయం పోయింది



ఎంసెట్ పరీక్ష అంటే ఎలాంటి ప్రశ్నలు వస్తాయోననే భయం వెంటాడేది. 'సాక్షి' మాక్ టెస్ట్‌కు హాజరుకావడం వల్ల ఆ భయం పోయింది. ప్రధాన పరీక్షను ధైర్యంగా రాయగలనన్న నమ్మకం కలిగింది. ఇలాంటి మాక్ టెస్ట్‌లు రాయడం వల్ల విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెరుగుతుంది.

- పి.అనూష, నారాయణ జూనియర్ కళాశాల

'సాక్షి' మాక్ ఎంసెట్ భేష్



'సాక్షి' పత్రిక నిర్వహించిన మాక్ టెస్ట్.. విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం కలిగించింది. ఆన్‌లైన్ ద్వారా ప్రశ్నలకు జవాబులు ఎలా రాయాలో తెలిసింది. సమయం ఎలా సద్వినియోగం చేసుకోవాలో బోధపడింది. ఇంకా సన్నద్ధం కావాల్సిన అంశాలు ఏమిటని తెలిసింది.

- జి.వర్షిని, ఎస్‌ఆర్‌ఐ జూనియర్ కళాశాల

పరీక్ష సామర్థ్యం పెరిగింది



'సాక్షి' ఎంసెట్ మాక్ టెస్ట్ రాయడం వల్ల పరీక్షల నిర్వహణపై పూర్తి అవగాహన పెరిగింది. పేపర్ ఎలా ఉంటోందో పూర్తిగా అవగతమైంది. ఇది మాకు మంచి అనుభవం ఏర్పర్చింది. భవిష్యత్‌లో రానున్న విద్యార్థుల సౌలభ్యం కోసం మరిన్ని పరీక్షలు నిర్వహించాలి.

- పి.శ్రీసాయి అఖిల్, గవర్నమెంట్ జూనియర్ కళాశాల

విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరం



'సాక్షి' దినపత్రిక నిర్వహించిన మాక్ ఎంసెట్ పోటీలు విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా మారుతాయి. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులపై నెలకొన్న భయాన్ని దూరం చేసేందుకు, నూతన విధానాలపై అవగాహన కల్పిస్తూ నిర్వహించిన మాక్‌టెస్ట్‌కు స్పందన లభించింది.

- తాళ్ల మల్లేశం, తాళ్ల పద్మావతి విద్యా సంస్థల చైర్మన్

మస్తు పోటీ..

● వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాల బరిలో 65 మంది అభ్యర్థులు
● ఇప్పటి వరకు ఇదే రికార్డ్

హన్మకొండ అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని వరంగల్, మహబూబాబాద్ లోక్ సభ స్థానాలకు ఉపసంహరణ, తిరస్కరణ ప్రక్రియ ముగిసింది. ఈ నేపథ్యంలో ఈ రెండు స్థానాలకు మొత్తం 65 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. గతంలో హనుమకొండ, వరంగల్ పార్లమెంట్ స్థానాలుగా ఉన్నప్పుడుగాని పునర్విభజన తరువాత గాని ఎప్పుడూ ఇంత పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పోటీలో లేరు. ప్రస్తుత ఎన్నికల్లో ఇంత పెద్ద సంఖ్యలో నిలవడం రికార్డ్ అని చెప్పొచ్చు. గత 2019 ఎన్నికల్లో 29మంది మాత్రమే అభ్యర్థులు బరిలో ఉండగా ఈ సారి ఆ సంఖ్య రెట్టింపును దాటింది. 2009లో కాస్తా తక్కువ సంఖ్యలో 27 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 2014లో వరంగల్ ఎంపీగా భారీ మెజార్టీతో గెలుపొందిన కడియం శ్రీహరి రాజీనామా చేయడంతో 2015లో వరంగల్ లోక్ సభకు జరిగిన మధ్యంతర ఎన్నికల్లో అత్యధికంగా వరంగల్ పార్లమెంట్‌కు 23 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. 1999 నుంచి 2023 ఎన్నికల వరకు వరంగల్, మహబూబాబాద్ లోక్ సభస్థానాలకు (గతంలో వరంగల్, హనుమకొండగా ఉండేవి) ఎప్పుడు ఎంతమంది అభ్యర్థులు పోటీలో ఉన్నారో ఓసారి పరిశీలిద్దాం..

నియోజకవర్గ పునర్విభజనకు ముందు..

నియోజక వర్గం	1999	2004
హనుమకొండ	10	6
వరంగల్	07	10
మొత్తం	17	16

నియోజక వర్గం	2009లో	2014	2015 ఉప	2019	2024
వరంగల్	15	12	23	15	42
మహబూబాబాద్	12	17	-	14	23
మొత్తం	27	29	23	29	65

చోరీ చేశాడని.. కొట్టి చంపారు

● ప్లంబర్ హత్య కేసులో సోదరుల అరెస్ట్


మాట్లాడుతున్న సీఐ సంజీవ

హసన్‌పర్తి: నూతన ఇంటి నిర్మాణం కోసం తీసుకున్న సామానును చోరీ చేసిన ఘటనలో ఓ ప్లంబర్‌ను అన్నదమ్ములు కర్రలతో చితకబాది హత్య చేశారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి మొగిలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరిపారు. హత్య చేసినట్లు అంగీకరించడంతో నిందితులను సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ సంజీవ తెలిపారు. హసన్‌పర్తి మండలం పెగడపల్లికి చెందిన పేరం శ్రీనివాస్(45)ప్లంబర్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో తన బాబాయ్ కుమారుడు పేరం రవీందర్ తాను నిర్మిస్తున్న కొత్త ఇంటి నిర్మాణానికి సంబంధించిన ప్లంబింగ్ పనుల బాధ్యతను శ్రీనివాస్‌కు అప్పగించాడు. ఈ క్రమంలో ప్లంబింగ్ కోసం తీసుకొచ్చిన కొంత సామానును శ్రీనివాస్ చోరీ చేసి ఓ శానిటరీ షాపులో విక్రయించాడు. అయితే సామాను కనిపించకపోవడంతో శ్రీనివాస్‌పై రవీందర్‌కు అనుమానం కలిగింది. దీంతో ఈనెల 24న రాత్రి రవీందర్, తన తమ్ముడు శ్రీనివాస్.. రాత్రి శ్రీనివాస్(ప్లంబర్) ఇంటికి వెళ్లారు. ప్లంబింగ్ సామాను ఏమైందని ప్రశ్నించారు. ఈక్రమంలో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సామాను చోరీ చేసి అమ్మినట్లు శ్రీనివాస్ అంగీకరించడంతో వారు ఆగ్రహంతో కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ ఈనెల 26న ఎంజీఎంలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి మొగిలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ సంజీవ తెలిపారు.

పిడుగుపాటుతో యువ రైతు మృతి

● వర్షం లేకుండానే ఘటన


ఉపేందర్(ఫైల్)

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం గ్రామంలో ఎలాంటి వర్షం లేకుండానే ఎర్రటి ఎండలో పిడుగుపడడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. మండలంలోని ఎక్కల గ్రామానికి చెందిన యువ రైతు దుబ్బ ఉపేందర్(26) సోమవారం సాయంత్రం గాలిదుమారం, ఉరుములు, మెరుపులు రావడంతో కల్లంలోని వడ్లపై బర్కాలు (టార్పాలిన్) కప్పడానికి వెళ్లాడు. అక్కడ ఒక్కసారిగా ఉరుమడంతో పాటు పిడుగుపడింది. దీంతో ఉపేందర్ మృతి చెందాడు. కాగా, తండ్రి 20 ఏళ్ల క్రితం చనిపోవడంతో తల్లి విజయ ఆశ వర్కర్‌గా పని చేసుకుంటూ ఉపేందర్‌ను సాకుతోంది. ఉపేందర్ తల్లికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. తమకున్న రెండు ఎకరాల్లో వ్యవసాయం సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో కుమారుడు చనిపోవడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

మహిళలకు పకోడీ ఇస్తున్న మాజీ సీఎం కేసీఆర్



స్థానికులతో ముచ్చటిస్తున్న కేసీఆర్



కేసీఆర్‌తో సెల్ఫీ దిగుతున్న యువకుడు



చాయ్ హోటల్‌లో కాసేపు కేసీఆర్

● ఖమ్మం బస్సు యాత్రలో..

బస్సుయాత్రలో భాగంగా హనుమకొండ నుంచి ఖమ్మం బయలుదేరిన బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మార్గమధ్యలోని మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట స్టేజితండా రోడ్డు పక్కన ఉన్న చిన్న చాయ్ హోటల్ వద్ద కాసేపు ఆగారు. హోటల్‌లో ఉన్న మిర్చి బజ్జి, పకోడీ, గారెలను కేసీఆర్‌కు అందించారు. వాటిని ఆరగించిన కేసీఆర్ వారితో కాసేపు ముచ్చటించారు. పలువురు దివ్యాంగులు, మహిళలు, వృద్ధులు కేసీఆర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు.

- మరిపెడ రూరల్